క్లుప్తంగా

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఫిజిక్స్ సబ్జెక్టులో అతిథి అధ్యాపక పోస్టుకు (రెండు నెలలకు మాత్రమే) అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ కోరారు. అభ్యర్థులు ఎమ్మెస్సీలో 50 శాతం మార్కులకు తక్కువ కాకుండా ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎంపికైన అధ్యాపకుడికి గంట బోధనకు రూ.375 చొప్పున నెలకు గరిష్ఠంగా రూ.27 వేలు చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్నారు ఈ నెల 23వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు అన్ని సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరు కావాలని కోరారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

అమలాపురం టౌన్: సమాచారం హక్కు చట్టంపై ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అధికారులకు, సిబ్బంది పూర్తిగా అవగాహన అవసరమని జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ అన్నారు. స్థానిక జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా అధికారి రమణ మాట్లాడారు. ప్రతి ఉద్యోగి తన పరిధిలో ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన సూచించారు. జిల్లా ఉద్యాన శాఖ సిబ్బందికి ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ల నూతన కార్యవర్గం ఎన్నిక



ఉప్పలగుప్తంలో నూతనంగా ఎన్నికైన పాస్టర్ ఫెలోషిప్ కార్యవర్గం

ఉప్పలగుప్తం: స్థానిక మన్నా చర్చిలో పాస్టర్ చిక్కం దానియేలు అధ్యక్షతన ఫెలోషిప్ సంఘ పాస్టర్ల ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాస్టర్ల ఫెలోషిప్ ఎన్నికను నిర్వహించి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చిక్కం దానియేలు, అధ్యక్షుడిగా పి.జయరాజు, ఉప అధ్యక్షుడిగా వి.యోహోను, కార్యదర్శిగా పి.ఎలీషా, ట్రెజరర్ పి.జాన్‌సుందర్ సింగ్, సంయుక్త కార్యదర్శిగా ఎ.ప్రేమ్‌ప్రసాద్, అడ్వైజర్‌గా టి.ప్రభుదాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు.

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ

అమలాపురం రూరల్: బండారులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కోనసీమ జిల్లా వైద్యాధికారి ఎం. దుర్గారావు దొర శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్యులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి పీఎంజేపీ, పీఎంవీవీవై పథకాలపై, ఆసుపత్రిలో కాన్పులపై ఆరా తీశారు. అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సీసీ రాయుడు రామకృష్ణమూర్తి, సూపర్‌వైజర్ సత్యనారాయణ, బసవారాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

యానాం: అంతర్జాతీయ చదరంగం దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక రీజెన్సీ హైస్కూల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రధానోపాధ్యాయుడు టీబీఎస్ఎస్‌వీ ప్రసాదరావు బహుమతులను ప్రదానం చేశారు. ఉపాధ్యాయుడు బి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోచింగ్‌కు సహాయం అందించాలి

యానాం: ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కోచింగ్ తీసుకోవడానికి ఆది ద్రావిడ శాఖ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని శనివారం ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ది లిబరేషన్ టైగర్స్ రాష్ట్ర కార్యదర్శి తము లవన్నన్ తదితరులు ఆది ద్రావిడ శాఖ కార్యదర్శి ముత్తమ్మకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీట్, ఇంజినీరింగ్, నర్సింగ్ తదితర కోర్సులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. మూసివేసిన ఎస్సీ హాస్టళ్లను త్వరితగతిన పునఃప్రారంభించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

అమలాపురం టౌన్: ఓ ప్రైవేటు ఆస్పత్రిలో విధులు ముగించుకుని అమలాపురం నుంచి తన స్వగ్రామం అయినవిల్లి మండలం నేదునూరు గ్రామానికి తన కుమార్తెతో కలిసి స్కూటీపై వెళుతున్న తల్లి చప్పిడి లక్ష్మిని గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ఆమె గాయాలపాలైంది. ఈనెల 17న రాత్రి 11 గంటల ప్రాంతంలో స్థానిక ఎర్ర వంతెన వద్ద ఈ ప్రమాదం జరిగింది. స్కూటీని ఢీకొట్టి వాహన చోదకుడు పరారయ్యాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ లక్ష్మి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

సాగునీరందక పొలాలకు బీటలు

- నారు సిద్ధంగా ఉన్నా నాట్లు వేయలేని పరిస్థితి
- అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులకు ఇక్కట్లు
- ఖరీఫ్ సాగు ప్రారంభంలోనే పెరుగుతున్న పెట్టుబడి



పల్లంకుర్రు సాపేవారి పేట వద్ద ఇంజిన్లతో నీటిని తోడుకుంటున్న రైతులు



పల్లంకుర్రులో సాగునీరు లేక బీడువారిన పంట చేలు

కాట్రేనికోన: తొలకరి పంట సాగు చేసేందుకు నీరు అందక నాట్లు వేయలేని గడ్డు పరిస్థితులు గతంలో ఎన్నడూ చూడలేదని రైతులు, కౌలుదారులు వాపోతున్నారు. సాగుకు పొలాలను దుక్కి దున్ని సిద్ధం చేసినా సాగునీరందక ఇంకా నాట్లు వేయలేదని వారన్నారు. గోదావరి సెంట్రల్ డెల్టా ఆధునీకరణ పనుల్లో భాగంగా బొబ్బర్లంక నుంచి పల్లంకుర్రు వెళ్లే బ్యాంకు కెనాల్‌పై ఆధునీకరణ పనులు చేపట్టింది. పంటకాలువ నీరు నిలుపుదల చేసిన వెంటనే ఆధునీకరణ పనులు చేపట్టి సకాలంలో సాగు నీరు అందించి ఉంటే వరి నాట్లు పూర్తయ్యేవని, వర్షాకాలంలో తుఫాన్లు వచ్చేసరికి పంట చేతికి వచ్చేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూడుకుపోయిన పంట కాలువలు

మండలంలో సుమారు 5,500 ఎకరాల వరి సాగవుతుండగా ఇంకా 4,100 ఎకరాల్లో నాట్లు వేయవలసి ఉంది. చెయ్యేరు, పెనుమల్లే, బంటుమిల్లి, ఉప్పూడి, కాట్రేనికోన, కుండలేశ్వరం, తిమ్మాపురం, వేట్లపాలెం, గెద్దనపల్లి, కొప్పిగుంట, దొంతికుర్రు, కందికుప్ప, పల్లంకుర్రు, కాట్రేనికోన రేవువారి పేటకు వెళ్లే రోడ్డులో వేలాది ఎకరాలకు సాగు నీరు అందక ఇంకా నాట్లు వేయలేదు. పంట చేలు బీటలు వారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కాలువలు గుర్రపు డెక్క, చెత్త, పూడికతో నిండిపోవడం, పూడికలు తొలగించకపోవడంతో శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. వర్షాకాలం ప్రారంభమైనా నారును బతికించుకునేందుకు ఇంజిన్లతో కాలువలో ఉన్న కొద్దినీటిని తోడుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు. ఎగువ ప్రాంతాల్లోని రైతులు పంట బోదెలకు, కాలువలకు అడ్డుకట్టలు వేయడంతో శివారు భూములకు నీరందడం లేదు. ఈ విషయమై రైతుల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. కౌలు రైతులు నాట్లు వేయక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోర్ల కింద సాగుకు అంతంతమాత్రంగానే ఉంది. సంబంధిత అధికారుల అలసత్వం కారణంగా సాగు నీరు అందించకపోవడంతో నాట్లు వేసేందుకు నారుమడులు సిద్ధమైనా ఏమీచేయలేని దుస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు.

కౌలుదారుల గగ్గోలు

ఆధునీకరణ పనులతో పంట కాలువలకు సాగు నీటి విడుదలలో తాత్సారం చేయడంతో నారుమడులు ఆలస్యంగా వేయవలసి వచ్చింది. ఇంజిన్లతో నీరు తోడుకుని కొందరు నారుమడులు వేశారు. నారు సిద్ధమైనా నీరు లేక రెండు సార్లు పొలాలను దుక్కి చేయలేదని రైతులు తెలిపారు. మొదటి దుక్కుదున్నిన అనంతరం నీరు లేక రెండో దుక్కు పూర్తి చేయని పొలాల్లో ప్రస్తుతం గడ్డి మొలిచింది. ఎకరాకు గట్టు లంకలు వేసేందుకు ఇద్దరు మనుషులకు రెండు రోజులకు రూ.2వేలు, దుక్కి చేసేందుకు రూ.2 వేలు, నీరు తోడేందుకు రూ.1000 ఖర్చు చేసినా ఫలితం లేదని రైతులు అన్నారు. ఈ ఖరీఫ్‌లో వరి సాగుకు అధిక ఖర్చు చేయవలసి వస్తోందని కౌలుదారులు గగ్గోలు పెడుతున్నారు.

ఇంజిన్లతో సాగు నీరు తోడుతున్నాం

పంట కాలువలో నీరు లేదు, వరుణుడు కరుణించకపోవడంతో దుక్కి చేసేందుకు చుక్క నీరు లేక అధిక భారమైనప్పటికీ ఇంజిన్లతో నీటిని తోడవలసి వస్తోంది. కందికుప్ప, పల్లంకుర్రు పంట కాలువలో సరిపడా నీరు లేదు. పంట బోదెలకు రైతులు ఉమ్మడిగా ఖర్చులు భరించి ఇంజిన్లతో సాగునీరు తోడుకుంటున్నారు. వర్షాకాలం తుఫాన్లతో రైతులకు పంట చేతికి వస్తుందో లేదో తెలియదు కాని సాగు ప్రారంభంలోనే అధిక ఖర్చు చేయవలసి వస్తోంది. సంబంధిత అధికారులు అలసత్వం వదిలి సాగు నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



రామాలయం పేటలో సాగునీరు అందక దుక్కిదున్ని, వదిలేసిన పొలంలో పెరిగిన గడ్డి

కామాక్షీ పీఠంలో చిన్నారులకు చదరంగంలో శిక్షణ



కామాక్షీ పీఠంలోని పిల్లలకు చెస్ బోర్డులను అందజేసిన చెస్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీకామాక్షీ పీఠంలోని ప్రేమ మందిరంలోని అనాథ పిల్లలకు వారానికో రోజు చెస్ క్రీడలో ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు జిల్లా చెస్ అసోసియేషన్ ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా పీఠంలోని అనాథ పిల్లలకు చెస్ బోర్డులను రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె.జగదీష్, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకటసురేష్‌కుమార్ శనివారం రాత్రి అందించారు. ఆదివారం నిర్వహించనున్న ప్రపంచ చెస్ డే సందర్భంగా కోనసీమ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ చెస్ బోర్డులు పంపిణీ చేశారు. జిల్లా అసోసియేషన్ పర్యవేక్షణలో వారానికో రోజు పీఠంలో ఇక నుంచి చెస్ క్రీడాంశంపై చిన్నారులకు శిక్షణనిస్తామని జిల్లా కార్యదర్శి వెంకటసురేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జగదీష్, కామాక్షీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ, ప్రేమ మందిరం అమ్మ వక్కలంక వాణి, పీఠం ఉత్తరాధికారి విఘనస రాఖీ ప్రేమ్, ట్రస్టీ సభ్యులు వీరా నాగేశ్వరరావు, మట్టపర్తి సత్యనారాయణ, పీఠం మేనేజర్ మర్రి దుర్గారావు పాల్గొన్నారు.

పీఎం సురక్ష బీమా యోజన పరిహారం అందజేత



లక్ష్మికి పీఎం సురక్ష బీమా యోజన పరిహారం మంజూరు పత్రాన్ని అందిస్తున్న యూబీఐ రీజినల్ హెడ్ నాయుడు

అమలాపురం రూరల్: బ్యాంకింగ్ కార్యకలాపాలు, బీమా పథకాలు, వివిధ రుణాల కల్పన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ బీజీఆర్ నాయుడు తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జనుపల్లిలో జన సురక్ష శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ పథకం 2015లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారన్నారు. పౌరులు బీమా సదుపాయం కవరేజ్ పొందేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనను ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకానికి కనీస వార్షిక ప్రీమియం రూ.20 చందాదారులు చెల్లించాలన్నారు. ప్రమాదవశాత్తు మరణం, పూర్తి వైకల్యం పాక్షిక వైకల్య బీమా రక్షణ ఉంటుందన్నారు. గ్రామానికి చెందిన కే నాగభూషణం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మే 20న మరణించడంతో ఆయన భార్య కె.లక్ష్మికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా రూ.2 లక్షల పరిహారాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. ఎల్‌డీఎం కేశవవర్మ, యూబీఐ బ్రాంచ్ హెడ్ కె.శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

కోరంగి రోప్‌వే బ్రిడ్జిపై రాకపోకలు బంద్



కోరంగి రోప్‌వే బ్రిడ్జిపై రాకపోకలను నిలుపుదల చేస్తున్న అధికారులు, నాయకులు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పరిధిలోని రోప్ వే బ్రిడ్జిపై రాకపోకలు బంద్ చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ తెలిపారు. శనివారం సర్పంచ్ పెయ్యల మంగేష్ అధ్యక్షతన పాతకోరంగి బ్రిడ్జి వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రమణ మాట్లాడుతూ వంతెన శిథిలస్థితికి చేరుకుని ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాకపోకలు నిలిపివేయాలని అన్నారు. బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ వంతెన పునర్నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయని, పనులు సత్వరమే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్ అధికారుల సూచనల మేరకు రాకపోకలు బంద్ చేస్తున్నట్లు తెలిపారు. వంతెనపై ప్రయాణించే వారందరూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.రామలక్ష్మి, పి. రత్నకుమారి, తాతాజీ, కొప్పిశెట్టి బాబి, చంద్రాల బుజ్జి, పెయ్యల శ్రీనివాస్, కొప్పిశెట్టి చంట తదితరులు పాల్గొన్నారు.

యూపీ పాఠశాలకు పుస్తకాల వితరణ

అమలాపురం రూరల్: రోళ్లపాలెం గున్నపంతులు అగ్రహారం యూపీ పాఠశాలకు పేరూరు చెందిన యనమదల వెంకటసత్యనారాయణ మాతృమూర్తి బాలా త్రిపుర సుందరి జ్ఞాపకార్థం రూ.10వేలు విలువైన వివిధ రకాల పుస్తకాలు బహూకరించినట్టు ఆంగ్ల ఉపాధ్యాయుడు ఆదుర్తి వెంకటఅప్పారావు తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయ గదిని మట్టా సాయిరామారావు, మాజీ సర్పంచ్ రంకిరెడ్డి అబ్బులు, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ చుట్టుగుళ్ల తలుపులమ్మ శనివారం ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్, ఉపాధ్యాయులు లలితకుమారి, రమేష్, గాలి వర్మ, సామరసత మిషన్ కోనసీమ జిల్లా కన్వీనర్ యనమదల లక్ష్మి పాల్గొన్నారు.

నిరుపయోగంగా నిర్మాణ సామగ్రి

యానాం: వరద నుంచి యానాం నియోజకవర్గాన్ని కాపాడేందుకు రక్షణ నిర్మాణానికి 15 ఏళ్ల క్రితం తీసుకువచ్చిన సుమారు రూ.20 కోట్ల విలువైన సామగ్రిని నిర్లక్ష్యంగా వదిలేశారని దీనికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్థాని దినేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణ గోడ నిర్మాణానికి తెచ్చిన రబ్బరు మ్యాట్లను ఓ ప్రైవేట్ స్థలంలో పెట్టారని తెలిపారు. రబ్బరు మేట్లు ఎండకు, వానకు తడిసి పాడైపోతున్నాయని అన్నారు.

కేంద్రం నుంచి నిధుల మంజూరు : యానాం నదీ పరివాహక ప్రాంతం చుట్టూ రక్షణ గోడ కోసం గతంలో పుదుచ్చేరి ప్రభుత్వానికి తెలియకుండా రూ.139 కోట్ల నిధులు కేంద్రం నుంచి మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ రబ్బరు మ్యాట్లు కొనుగోలు చేసి ఓ ప్రైవేటు స్థలంలో వేసి వెళ్లిపోయాడు. సంబంధిత పీడబ్ల్యూడీ అధికారులు కాంట్రాక్టరుకు వాటికి సంబంధించిన సొమ్ము చెల్లించారు. మ్యాట్లు భద్రపర్చిన ప్రైవేట్ స్థలం యజమానికి ఇప్పటి వరకు సుమారు రూ.4 లక్షలు అద్దె చెల్లించాల్సి ఉంది.



పాడైపోతున్న రబ్బరు మ్యాట్లు

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మండలంలోని మందపల్లిలో శనైశ్చర స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులు తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. దేవస్థానం ఈఓ దారపు రెడ్డి సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, సేవల ద్వారా రూ.1,65,150 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. అలాగే అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.29,830 రాగా మొత్తం రూ.1,94,980 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. ఆయన తెలిపారు. సిబ్బంది, గ్రామస్తులు భక్తులకు అన్నప్రసాద సేవలో పాల్గొన్నారు.

సమాజ భాగస్వామ్యంతోనే ప్లాస్టిక్ నిర్మూలన



కలెక్టరేట్‌లో స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్వో రాజకుమార్



అమలాపురంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, అధికారులు, నాయకులు

అమలాపురం రూరల్: సమాజ భాగస్వామ్యంతోనే ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యమవుతుందని జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి తెలిపారు. మూడో శనివారం సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం అనే ఇతివృత్తంతో ప్లాస్టిక్ నిర్మూలన అంశంపై కార్యక్రమాలు కలెక్టరేట్ సిబ్బందితో నిర్వహించామన్నారు. ప్లాస్టిక్ భూతాన్ని సమూలంగా నిర్మూలించేందుకు ప్రజలంతా కలిసి రావాలని డీఆర్వో పిలుపునిచ్చారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి కే కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా ప్లాస్టిక్‌కు బదులు ప్రత్యామ్నాయంగా జనపనార కాటన్ సంచులు, బ్యాగ్‌లు తయారుచేసి రైతుబజారు, సూపర్ బజార్లలో విక్రయించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ సూపరింటెండెంట్లు నాగలక్ష్మమ్మ, రమణకుమారి, ఉద్యోగులు ఎస్వీ భరత్, కృష్ణకాంత్, సాయిరాం పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం

అల్లవరం: స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంగా ప్రతి నెల పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జేసీ టి.నిశాంతి అన్నారు. ప్లాస్టిక్ కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా అల్లవరంలో చెత్త సేకరణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బొమ్మి బాలవేణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జేసీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల ఏర్పడే పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు గ్రామస్తులందరూ సహకరించాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులు స్థానంలో జూట్‌తో తయారుచేసిన బ్యాగ్‌లు, వాటర్ బాటిల్ స్థానంలో స్టీల్ బాటిళ్లను ఉపయోగించాలని జేసీ పిలుపునిచ్చారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బండిగుప్తాపు పాండురంగ, రుద్రరాజు గోపాలకృష్ణ ఇరువురు కలిలసి రూ. లక్ష విలువ చేసే జూట్ బ్యాగ్‌ల పంపిణీకి ముందుకు రావడంతో వారిని జేసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి మూర్తి, డీఎల్‌పీఓ బొజ్జిరాజు, ఎంపీడీఓ లక్ష్మణరావు, తహసీల్దార్ వీవీఎల్ నరసింహరావు, ఈఓపీఆర్‌డీ నాగేంద్ర పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన ర్యాలీలు

అమలాపురం టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛతను కాపాడాలని, ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నియంత్రించాలని నినాదాలు చేస్తూ అమలాపురం పట్టణంలో పలు చోట్ల స్వచ్ఛత ర్యాలీలు, ప్రతిజ్ఞలు శుక్రవారం నిర్వహించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద కార్యాలయ సిబ్బందితో ఆర్డీవో కొత్త మాధవి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత ర్యాలీకి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అతిథిగా పాల్గొన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్డీవో కార్యాలయ ఏవో భాస్కరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, కౌన్సిల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, కౌన్సిలర్లు, మున్సిపల్ ఇంజినీర్లు, వార్డ సచివాలయాల శానిటేషన్ సెక్రటరీలు ర్యాలీలో పాల్గొన్నారు.

గ్రామాల్లో ర్యాలీలు

అమలాపురం రూరల్: కామనగరువులో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం సర్పంచ్ నక్కా అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి ఆర్ఎస్ఎస్ సూరపరాజు తదితరులు పాల్గొన్నారు. బండారులంకలో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఇమ్మిడివరప్పాడులో సర్పంచ్ రేలంగి దుర్గారావు, పేరూరు సర్పంచ్ దాసరి అరుణడేవిడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు.

ముమ్మిడివరంలో..

ముమ్మిడివరం: ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం అనే నినాదంతో శనివారం ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో రమణమూర్తి



విఘ్నేశ్వరుని దర్శించుకున్న రమణమూర్తి దంపతులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని విజయవాడ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ జనరల్ ఎల్‌వీ రమణమూర్తి సతీసమేతంగా శనివారం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు, ఆలయ సిబ్బంది మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ వేదపండితులు రమణమూర్తి దంపతులను వేదమంత్రాలతో సత్కరించి, స్వామి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు. స్వామివారి ఆలయ విశిష్టతను వివరించారు.

సామూహిక గీతా పారాయణ

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో పురాణ ప్రసిద్ధి చెందిన జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో శనివారం సామూహిక గీతా పారాయణ నిర్వహించారు. గీతాపరివార్ సంస్థ ఐదో వార్షికోత్సవం సందర్భంగా దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి పర్యవేక్షణలో గీతాపరివార్ సభ్యులు ర్యాలి రామగోపాల్, ర్యాలి సుబ్బలక్ష్మి, గట్టి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సామూహిక గీతా పారాయణలో గ్రామస్తులు, భక్తులు పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

వరద కష్టాలు తీరేదెన్నడు?



ఐ.పోలవరం మండలం మురమళ్లలో వరద నీటిలో ఇళ్లు (ఫైల్)

ఐ.పోలవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరికి వరద పోటెత్తుతోంది. రానున్న రోజుల్లో మరింత వరద ముంచుకొచ్చే ప్రమాదం ఉంది. గోదావరికి భారీ వరదలు రావడం, మొదటి ప్రమాదకర హెచ్చరిక దాటగానే ఏటా కోనసీమ జిల్లాలో పదుల సంఖ్యలో లంక గ్రామాలు మునిగిపోవడం పరిపాటిగా మారింది. పంట పొలాలు, ఇళ్లు, రోడ్లు ముంపునకు గురవుతుంటాయి. మొదటి ప్రమాద హెచ్చరిక రాకుండానే ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పరిధిలో పలు లంక గ్రామాలు నీట మునిగిపోతుంటాయి. ముందుగానే ఇలా ముంపు బారిన పడుతున్న లంక గ్రామాల్లో మత్స్యకారులు అధికంగా ఉంటున్నారు.

మత్స్యకారులకు ఇబ్బందులు

గోదావరికి వరద పోటెత్తితే బ్యారేజీ దిగువన ఉన్న గౌతమి, వృద్ధ గౌతమి, వైనతేయ పాయల్లో వరద నీరు పోటెత్తి ఏటిగట్లను తాకుతోంది. ఈ మూడు నదీ పాయలు ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాలను ఆనుకుని ప్రవహిస్తున్నాయి. ఈ పాయలను ఆనుకుని ఏటుగట్టు దిగువున పలువురు మత్స్యకారులు నివాసముంటున్నారు. వీరితోపాటు తక్కువ సంఖ్యలో రైతులు, స్థానికులు నివాసముంటున్నారు. నది మధ్యలో ఉన్న లంకల్లో నివాసముంటున్న వారు సైతం పాయలను అనుకుని లోతట్టు ప్రాంతాల్లోనే ఉంటున్నారు. కొద్దిపాటి వరదకు ఇళ్లు, వేట వస్తువులు నీట మునగడం, రోజుల తరబడి ముంపులో ఉండడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. వరద సమయంలో వీరికి పునరావసం కల్పిస్తున్నా దొంగలకు భయపడి ఇళ్ల వద్దనే పడల మీద ఉంటూ వరద మధ్యలోనే జీవనం సాగిస్తున్నారు.

ఏటిగట్టు దిగువన ఉన్న గ్రామాలకు పొంచి ఉన్న ముప్పు

గోదావరికి వరద మరింత పోటెత్తితే ఐ.పోలవరం మండలంలో మురమళ్ల రాఘవేంద్ర వారధి, కేశనకుర్రు పల్లెగూడెం, ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాన్నేల్లంక, గురజాపులంక, కమిని, కాట్రేనికోన మండలం పల్లంకుర్రు రేవు, కుండలేశ్వరం రేవు వంటి ప్రాంతాలతోపాటు అల్లవరం మండలం బోడసకుర్రు పల్లిపాలెం, గోపాయిలంక, రెబ్బనపల్లిలోని ఏటిగట్టు దిగువున ఉన్న గ్రామాలు ముంపులో చిక్కుకుంటాయి. ఈ ప్రాంతాల్లో మత్స్యకారులు అధికంగా నివసిస్తున్నారు. కొద్దిపాటి వరదకి ముంపు బారిన పడుతున్న ఈ ప్రాంతాల్లోని స్థానిక మత్స్యకారులను, ఇతరులను ఏటిగట్టు ఎగువుకు తరలించాలనే ప్రతిపాదన ఉంది. ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. అదే సమయంలో వేటపై జీవనోపాధి సాగిస్తున్న మత్స్యకారులు నది తీరాన్ని ఆనుకుని ఉన్న తమ నివాసాలు వదులుకుని వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు. ఒకటిరెండు సందర్భాల్లో వీరిని మెరక ప్రాంతాలకు తరలించేందుకు, భూములు సేకరించి ఇళ్ల నిర్మాణాలకు ఇచ్చే ప్రయత్నాలు చేశారు. కొంతమందికి ఇళ్ల స్థలాలు కూడా కేటాయించినా వారు వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు. ఈ కారణంగా ఏటా వరదలు వచ్చే సమయంలో ఈ గ్రామాలు ముందుగా మునిగిపోవడం పరిపాటిగా మారింది. ఈ ఏడాది వరద వచ్చి వెంటనే తగ్గింది. మరో రెండు, మూడు లక్షల క్యూసెక్కుల ధవళేశ్వరం బ్యారేజీ నుంచి నీరు దిగువనకు విడుదల చేసి ఉంటే నదీ తీర ప్రాంత గ్రామాల్లో చాలా వరకు ఇళ్లు ముంపులో చిక్కుకునేవి.